ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



శనివారం 27 సెప్టెంబరు 2025

రూ.39.33 కోట్లతో గ్రంథాలయాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూ. 39.33 కోట్లతో నిర్మించిన 146 గ్రంథాలయాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. చెన్నై సచివాలయంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్త గ్రంథాలయాలను ప్రారంభించారు. ఇదే విధంగా కళ్లకురిచ్చిలో రూ.4.01కోట్లతో నిర్మించనున్న జిల్లా గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన చేశారు. పాఠ్య పుస్తకాలు, విద్యాబోధనా సేవల సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో 23 కొత్త గ్రంథాలయాలను కూడా సీఎం ప్రారంభించారు. కోయంబత్తూరు జిల్లా పెరియనాయకన్ పాళయం, ఈరోడ్ జిల్లా గోపిచెట్టి పాళయం, అలంపాళయం, అరియలూరు జిల్లా జయంకొండం ప్రాంతాలు సహా 146 ప్రాంతాల్లో నిర్మించిన కొత్త గ్రంథాలయాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అన్బిల్ మహేష్, పాఠశాలల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ పి. చంద్రమోహన్, రాష్ట్ర పాఠ్యపుస్తకాల ప్రచురణ సంస్థ అధ్యక్షుడు దిండుగల్ లియోని, ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం. ఆరతి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ సంయుక్త సంచాలకులు ఎస్ ఇలంగో చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రంథాలయాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

గిండిలో భౌగోళిక సారంగ శాఖ కార్యాలయం...

రాష్ట్ర సహజవనరుల శాఖ ఆధ్వర్యంలో సచివాలయంలో ఏర్పాటైన మరొక కార్యక్రమంలో గిండి పారిశ్రామికవాడలో రూ.23.10 కోట్లతో నిర్మించిన భౌగోళిక సారంగ శాఖ ప్రధాన కార్యాలయాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎస్.రఘుపతి, సహజవనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి సున్ సొంగమ్ ఐడక్ సిరు, భౌగోళిక సారంగ శాఖ సంచాలకులు డి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు వీధులకు కొత్త నేమ్‌బోర్డులు...

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రతిపాదన మేరకు నగరంలోని రెండు వీధుల పేర్లు మారాయి. నుంగంబాక్కంలో తమిళ సినీ జేమ్స్‌బాండ్ జయశంకర్ నివసించిన కాలేజీ లేన్‌కు 'జయశంకర్ రోడ్డు'గా పేరు మార్చారు. ఇదే విధంగా రంగస్థల నటుడు, టీవీ సీరియల్ నిర్మాత, తమిళ హాస్యనటుడు ఎస్వీ శేఖర్ తండ్రి ఎస్వీ వెంకటరామన్ నివసించిన మందవెలిపాక్కం ఐదో క్రాస్ వీధికి 'ఎస్వీ వెంకటరామన్ వీధి' అని పేరుపెట్టారు. ఈ రెండు ప్రాంతాల్లో ఏర్పాటైన కొత్త నేమ్‌బోర్డులను సచివాలయం నుండి ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో శాసనసభ్యుడు డాక్టర్ ఎన్.ఎళిలన్, నగరపాలక నీటి సరఫరా శాఖ ముఖ్య కార్యదర్శి డి.కార్తికేయన్, చెన్నై కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుబరన్, దివంగత నటుడు జయశంకర్ కుటుంబసభ్యులు, హాస్యనటుడు ఎస్వీ శేఖర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

4నుంచి ఉప రాష్ట్రపతి పర్యటన

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అక్టోబరు 4వ తేదీ రాష్ట్రానికి రానున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అభ్యర్థిగా పోటీచేసిన సీపీ రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా విజయం సాధించి, బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 12న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన సీపీ రాధాకృష్ణన్.. తొలిసారిగా రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రానికి రానున్నారు. ఈ నెల 4న ఢిల్లీ నుంచి విమానంలో నగరానికి చేరుకోనున్న ఉప రాష్ట్రపతికి బీజేపీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలకనున్నారు. నగరంలో బసచేయనున్న ఉప రాష్ట్రపతిని పలువురు ప్రముఖులు కలుసుకుని శుభాకాంక్షలు తెలపనున్నారు. నగర ప్రజల తరఫున ఉప రాష్ట్రపతికి అభినందన సభ ఏర్పాటుచేయనున్నారు. మరుసటిరోజు ఆయన కోయంబత్తూర్ వెళ్తారు. కోవైలో పలువురు ప్రముఖులు ఉప రాష్ట్రపతికి అభినందనలు తెలుపనున్నారు. 5వ తేది సాయంత్రం లేదా 6వ తేది ఉదయం ఉప రాష్ట్రపతి ఢిల్లీ బయల్దేరి వెళ్లనున్నారు.



క్రీడాకారులకు ప్రోత్సాహక నిధి అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి

పది వేల కోట్లు పోయినా త్రిభాషా విధానాన్ని అంగీకరించం

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ఇవ్వాల్సిన పదివేల కోట్ల నిధులను ఆపేసినా త్రిభాషా విధానాన్ని అంగీకరించబోమని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్పష్టం చేశారు. నగరంలో జరిగిన డీఎంకే ముప్పెరుం వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... త్రిభాషా విధానానికి అంగీకరించకపోతే విద్యా నిధులు విడుదల చేయబోమని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెబుతున్నారని, అలా బెదిరించి హిందీ నిర్బంధించాలని కేంద్ర ప్రభుత్వ భావిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు కాదు, రూ.10 వేల కోట్లు ఇచ్చినా తాము త్రిభాషా విధానాన్ని అంగీకరించబోమని ఉదయనిధి స్పష్టం చేశారు. జీఎస్టీ తగ్గింపు అని బీజేపీ ఆడుతున్న నాటకానికి అన్నాడీఎంకే వంత పాడుతోందని, అసలు జీఎస్టీ ఎవరు పెంచారో చెప్పాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అందిస్తున్న మహిళా ప్రోత్సాహక నిధిని 90 శాతం మంది మహిళలు వైద్య ఖర్చులను వినియోగిస్తున్నారన్నారు. ఈ నిధులు మరింతమందికి ఇచ్చేలా చర్యలు చేపట్టామని, అందులో భాగంగా అందరికి నిధులు అందేలా నిబంధనలు సడలించామని తెలిపారు. తాను శనివారం మాత్రమే ఇంటి నుంచి బయటకు వచ్చే వ్యక్తిని కాదని టీవీకే అధ్యక్షుడు విజయ్‌నుద్దేశించి పరోక్ష విమర్శలు చేశారు. వారంలో ఐదు రోజులు బయట ప్రాంతాల్లోనే ఉంటానని వ్యాఖ్యానించారు.

క్రీడాకారులకు రూ.21.40 కోట్ల చెక్కులు

అంతర్జాతీయ, ఆసియా, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన 819 క్రీడాకారులకు కలైవానర్ అరంగంలో శుక్రవారం యువజన సంక్షేమం మరియు క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రూ.21.40 కోట్ల విలువైన ప్రోత్సాహక చెక్కులు, కారుణ్య ప్రాతిపదికన నలుగురు క్రీడాకారులకు ఉద్యోగ నియామక పత్రాలను ఆ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రీడారంగంలో దేశంలోనే తమిళనాడును అగ్రస్థానంలో నిలిపేలా చర్యలు చేపట్టామన్నారు. క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా ప్రభుత్వ, ప్రభుత్వ రంగాల్లో ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు. 'ఎలైట్ స్పోర్ట్స్ స్కాలర్‌షిప్' పథకంలో క్రీడాకారులను అందించే ప్రోత్సాహక మొత్తం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచడంతో పాటు ఈ పథకంలో లబ్ధిదారుల సంఖ్య 12 నుంచి 15కు పెంచామన్నారు. అలాగే, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అందించే ఆర్థిక సాయం రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచి, ఈ పథకంలో ప్రయోజనం పొందుతున్న క్రీడాకారుల సంఖ్య 125కు పెంచామన్నారు. అలాగే, ఛాంపియన్ డెవలప్‌మెంట్ పథకంలో ప్రయోజనం పొందుతున్న క్రీడాకారుల సంఖ్య వంద నుంచి 200 పెంచినట్లు తెలిపారు. శిక్షణ కోసం విదేశాలకు వెళ్లే క్రీడాకారులకు అత్యాధునిక, అధిక నాణ్యత కలిగిన క్రీడా పరికరాలు అందిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.



తూత్తుకుడి తీరంలో నిలిచిపోయిన పడవలు

కోస్తా జిల్లాలకు తుఫాన్ హెచ్చరిక

● చేపలవేటకు వెళ్లని మత్స్యకారులు

ప్యారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతుండడంతో రాష్ట్రంలో కోస్తా జిల్లాల్లో గంటకు 50 నుండి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో అప్రమత్తమైన తూత్తుకుడి జిల్లా జాలర్లు సముద్రంలో చేపలవేటకు వెళ్లకుండా ఆగిపోయారు. దీంతో తూత్తుకుడి ఫిషింగ్ హార్బర్‌లో 200 మరపడవలు, 300లకు పైగా నాటు పడవలు తీరానికే పరిమితమయ్యాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శుక్రవారం నాటికి వాయుగుండంగా బలపడిందని, ఇది శనివారం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుందని వాతావరణ శాఖ తెలిపింది. వాయుగుండ ప్రభావం వల్ల కోస్తా జిల్లాల్లో గంటకు 50 నుండి 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, శని, ఆదివారాల్లో జాలర్లు సముద్రంలో చేపలవేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీచేసింది.



మదురై ధర్మాసనం బయట లాయర్లు, కక్షిదారులు, స్థానికులు

ఆగని బాంబు బెదిరింపులు

● మదురై డివిజన్ బెంచ్, డీజీపీ కార్యాలయానికి కూడా ఈమెయిల్స్

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బాంబు బెదిరింపులు ఆగడం లేదు. తాజాగా మదురైలోని హైకోర్టు డివిజన్ బెంచ్, చెన్నై మెరీనాబీచ్ వద్దనున్న డీజీపీ కార్యాలయానికి బాంబు బెదిరింపుల ఈమెయిల్స్ వచ్చాయి. మదురై హైకోర్టు డివిజన్ బెంచ్‌లో 14 జిల్లాలకు చెందిన కేసులపై విచారణ జరుగుతుండటంతో రోజూ వేల సంఖ్యలో కక్షిదారులు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, సిబ్బంది వస్తుంటారు. శుక్రవారం ఉదయం కోర్టు ప్రారంభం కావడానికి ముందే లాయర్లు, కక్షిదారులతో ప్రాంగణం నిండిపోయింది. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి హైకోర్టు రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపిన ఈమెయిల్‌లో కోర్టులో బాంబులున్నాయని, కాసేపట్లో అవి పేలనున్నాయని హెచ్చరించాడు. దీనిని గమనించిన అధికారులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. బాంబు బెదిరింపు వచ్చిందని తెలియగానే న్యాయమూర్తులు, న్యాయవాదులు, ఉద్యోగులు, కక్షిదారులు వెంటనే కోర్టు నుంచి బయటకు వచ్చారు. బాంబ్ స్క్వాడ్ నిపుణులు మెటల్ డిటెక్టర్లతో, జాగిలాలతో కోర్టు ప్రాంగణం అంతా క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీద అది ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని నిర్ధారణ కావడంతో అప్పటి వరకు ఆందోళన చెందిన వారంతా ఊరట చెందారు. ఈ సంఘటన కారణంగా కేసుల విచారణ ఆలస్యంగా ప్రారంభమయ్యాయి.

డీజీపీ కార్యాలయంలో...

మెరీనాబీచ్ సమీపంలో ఉన్న డీజీపీ కార్యాలయానికి కూడా శుక్రవారం ఉదయం బాంబు బెదిరింపు వచ్చింది. ఆ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తి పంపిన ఈమెయిల్‌లో డీజీపీ కార్యాలయంలో బాంబులున్నాయని, కాసేపట్లో అవి పేలనున్నాయని పేర్కొన్నాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు బాంబ్ స్క్వాడ్ , డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి క్షుణ్ణంగా తనిఖీలు జరిపారు. అన్ని గదుల్లో తనిఖీలు జరిపిన మీదట అది ఉత్తుత్తి బాంబు బెదిరింపేనని నిర్ధారించారు.

అన్నాడీఎంకే విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈపీఎస్

● ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధీమా వ్యక్తం చేశారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నేత ఈపీఎస్ 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో చేపట్టిన ప్రచారయాత్ర శుక్రవారం కరూర్ జిల్లాలోని అరవకురిచ్చి అసెంబ్లీ నియోజకవర్గం మీదుగా సాగింది. కరూర్ వేలుస్వామి మఠం జంక్షన్‌లో జరిగిన రోడ్‌షోలో ఈపీఎస్ మాట్లాడుతూ, తన ప్రచార సభకు పెద్దసంఖ్యలో హాజరైన ప్రజలను చూస్తుంటే అప్పుడే ఎన్నికల్లో గెలిచినంత ఆనందంగా ఉందన్నారు. ఈ సభ ప్రతిపక్షాలను తప్పకుండా వణికిస్తుందని, 2026లో జరగనున్న ఎన్నికల్లో అన్నాడీఎంకే నేతృత్వంలో ఏర్పడే కూటమి అధికార పీఠమెక్కుతుందని, దీనిని ఏ శక్తి అడ్డుకోలేదని ఆయన ధీమా వ్యక్తంచేశారు. నట చక్రవర్తి శివాజీ గణేశన్ కంటే అవినీతి మంత్రిగా న్యాయస్థానం చేత చివాట్లు తిన్న సెంథిల్ బాలాజీ బాగా నటిస్తారని, ఆయన ఎన్నికల సమయంలో ఓటర్లకు నగదు, నగలు పంపిణీ చేసి గెలవడం అలవాటుగా మార్చుకున్నారని విమర్శించారు. కొత్త పథకాల పేరుతో డీఎంకే పాలకులు ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని, కరూర్‌లో తాజాగా డిప్యూటీ సీఎం ఉదయనిధి ప్రారంభించిన బస్‌స్టేషన్ నిర్మాణంలో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని, దీంతో పాటు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై అన్నాడీఎంకే అధికారంలోకి వచ్చాక చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈపీఎస్ హెచ్చరించారు.

ఉస్మాన్‌రోడ్డులో ట్రాఫిక్ రద్దీకి చెక్

● రేపు టి.నగర్ ఫ్లైఓవర్ ప్రారంభం ● రోడ్‌షోలో పాల్గొననున్న సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో సుప్రసిద్ధ వాణిజ్యకేంద్రమైన టి.నగర్ ఉస్మాన్ రోడ్డులో యేళ్లతరబడి ట్రాఫిక్ సమస్యలకు ఆదివారంతో ఫుల్‌స్టాప్ పడనుంది. నార్త్, సౌత్ ఉస్మాన్ రోడ్లను కలిపేలా ప్రధాన రహదారి వంతెన పొడిగింపుగా నిర్మించిన కొత్త ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం అట్టహాసంగా జరుగనుంది. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ ఫ్లైఓవర్ ప్రారంభించనున్నారు. టి.నగర్ ప్రధాన రహదారి వంతెన మార్గాన్ని కొనసాగించేలా సీఐటీ నగర్ ఫస్ట్ మెయిన్‌రోడ్డు, సౌత్ ఉస్మాన్ రోడ్డును కలిపేలా 1.25 కిలోమీటర్ల పొడవున కొత్త ఫ్లైఓవర్ నిర్మించేందుకు 2023లో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించి, రూ.164.92 కోట్ల మేర నిధులను విడుదల చేసింది. రెండేళ్ల పాటు జరిగిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. దీంతో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ఈ కొత్త ఫ్లైఓవర్ స్టాలిన్ ప్రారంభించి, రోడ్‌షో చేయనున్నారు. ఈ కొత్త ఫ్లైఓవర్‌కు టి.నగర్‌కు చెందిన ట్రిప్లికేన్ మాజీ ఎమ్మెల్యే జె.అన్బళగన్ పేరుపెట్టారు. ఈ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను టి.నగర్ ఎమ్మెల్యే జే కరుణానిధి పర్యవేక్షిస్తున్నారు.



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కొత్త వంతెన ←



సచివాలయం వెలుపల మీడియాతో మాట్లాడుతున్న హాస్యనటుడు ఎస్వీ శేఖర్

విజయ్‌కి రాజకీయ పరిజ్ఞానం శూన్యం

● నటుడు ఎస్వీ శేఖర్

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) నేత విజయ్‌కి రాజకీయాలంటే ఏమిటో తెలియవని, అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలే ఆయనకు తగిన గుణపాఠం చెబుతారని హాస్యనటుడు ఎస్వీ శేఖర్ అన్నారు. శుక్రవారం ఉదయం సచివాలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ మందవెళిపాక్కంలోని ఐదో క్రాస్ రోడ్డుకు రంగస్థల నటుడైన తన తండ్రి వెంకట్రామన్ పేరు పెట్టినందుకు ఈ సందర్భంగా సీఎం స్టాలిన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై స్టాలిన్‌కు తాను అండగా నిలవాలని అనుకుంటున్నానని, అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫున ప్రచారం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. టీవీకే నేత రోడ్‌షోలకు జనం పెద్ద సంఖ్యలో రావటం గొప్ప విషయం కాదని, సినీ హీరోలను దగ్గరగా చూడటానికి అందరూ ఆసక్తి కనిపిస్తారని, ఆ సభలకు వచ్చినవారంతా ఆ పార్టీకి ఓటు వేయరనే చేదు నిజాన్ని విజయ్ గుర్తించాలన్నారు. విజయ్ ప్రతి రోడ్‌షోలోనూ ఏదో కంఠస్థం చేసుకుని వచ్చిన డైలాగులు పలికి వెళ్తున్నారని, ఎవరో రాసిచ్చిన డైలాగులను సినిమా షూటింగ్‌లో చెప్పినట్లు ఆవేశంగా చెబుతున్నారని ఎస్వీ శేఖర్ విమర్శించారు. రాజకీయాల్లో 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని, వారంతపు సెలవుదినాలైన శని, ఆదివారాల్లో మాత్రమే జనం ముందుకు రావటం విజయ్‌కి రాజకీయ పరిపక్వత లేదనే విషయాన్ని చాటిచెబుతోందని అన్నారు.

సమాచార దృశ్ని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా క్రోంపేట పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు విద్యుత్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి.. క్రోంపేట పరిధిలోని దుర్గా నగర్, టీఎన్‌హెచ్‌బీ కాలనీ, చెల్లిఅమ్మన్ ఆలయ వీధి, పిళ్లయార్ ఆలయ వీధి, చంద్ర నగర్, సీఎల్సీ రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు తెలిపింది.

ముగిసిన త్రైమాసిక పరీక్షలు

● నేటినుంచి పాఠశాలలకు సెలవులు

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో 1 నుంచి 12వ తరగతి త్రైమాసిక పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన త్రైమాసిక పరీక్షలు ఈ నెల 10వ తేది ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు శుక్రవారం ముగియగా, కొన్ని తరగతులతు గురువారం ముగిశాయి. శనివారం నుంచి అక్టోబరు 5వ తేది వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. అక్టోబరు 6వ తేది నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ తెలిపింది.

రేపు పనిచేయనున్న నీటి పన్ను వసూలు కేంద్రాలు

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జరిమానా లేకుండా పన్ను చెల్లించేందుకు సౌకర్యంగా, ఆదివారం పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తాయని మెట్రోవాటర్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై మెట్రోవాటర్ బోర్డుకు 2025-26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి అర్థవార్షిక పన్ను ఈ నెల 30వ తేది వరకు జరిమానా లేకుండా చెల్లించవచ్చని ప్రకటించారు. వినియోగదారుల సౌకర్యార్థం ఈ నెల 28, ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు పన్ను వసూలు కేంద్రాలు పనిచేస్తాయని మెట్రోవాటర్ బోర్డు తెలిపింది.

సీఎన్జీగా డీజిల్ బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖకు చెందిన 850 డీజిల్ బస్సులు రూ.66 కోట్లతో సీఎన్‌జీ బస్సులుగా మారనున్నాయి. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. పర్యావరణ పరిరక్షణ, డీజిల్ ఖర్చులు తగ్గించేలా, డీజిల్‌కు బదులుగా సీఎన్‌జీతో బస్సులు నడపాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం జనవరిలో మూడు బస్సులను ప్రయోగాత్మకంగా సీఎన్జీగా మార్చి ట్రయల్ రన్ నిర్వహించారు. ప్రస్తుతం, 850 డీజిల్ బస్సులను సీఎన్‌జీ విధానంలోకి మార్చేందుకు 'ఎకో ఫ్యూయల్ సిస్టమ్ ఇండియా లిమిటెడ్' అనే సంస్థకు రూ.66 కోట్ల కాంట్రాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది. ఏడాది కాలంలో ఈ బస్సులు అందించాలని ప్రైవేటు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అధికారులు తెలిపారు.

'నైరుతి'తో 4 శాతం అదనపు వర్షపాతం

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో 4 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. ఈ మేరకు ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... నైరుతి రుతుపవనాలతో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 309.2 మి.మీ కాగా, 4 శాతం అదనంగా 321.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇక, రాజధాని నగరం చెన్నైలో నైరుతిలో సాధారణ వర్షపాతదం 418.3 మి.మీ కాగా, 34 శాతం అదనంగా 558.7 మి.మీ వర్షపాతం నమోదైందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తే చర్యలు

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించే ప్రైవేటు పాఠశాలలపై చర్యలు చేపడతామని ప్రైవేటు పాఠశాల డైరెక్టరేట్ హెచ్చరించింది. పాఠశాలలకు శనివారం నుంచి అక్టోబరు 5వ తేది వరకు సెలవులు ప్రకటించారు.. ఈ క్రమంలో, కొన్ని ప్రైవేటు పాఠశాలలు సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ విషయం ప్రైవేటు పాఠశాలల డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... సెలవు రోజుల్లో విజయదశమి, ఆయుధ పూజ తదితర పండుగలు వస్తున్నాయని, పండుగల సమయంలో పిల్లలు తల్లిదండ్రులతో సరదాగా గడుపుతారని, అలాంటి సమయాల్లో ప్రత్యేక తరగతులకు నిర్వహించడం సమంజసం కాదన్నారు. విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా, సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని, అలా నిర్వహించే పాఠశాలలపై చర్యలు చేపడతామని ప్రకటనలో హెచ్చరించారు.

29న ఈపీఎఫ్ గ్రీవెన్స్

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ్) సమస్యల పరిష్కార శిబిరం ఈ నెల 29వ తేది చెన్నై సహా 8 జిల్లాల్లో జరుగనున్నాయి. ఈ మేరకు ఈపీఎఫ్ విడుదల చేసిన ప్రకటనలో... ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో 'ఈపీఎఫ్ మీ సమీపంలో' అనే శీర్షికన సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటలకు శిబిరాలు నిర్వహించనున్నామన్నారు. చెన్నై జిల్లా పరిధిలో షెనాయ్ నగర్ లక్ష్మి టాకీస్ రోడ్డు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి భవనంలోని మూడవ అంతస్తులో శిబిరం జరుగనుంది. అలాగే, తిరువళ్లూర్ జిల్లా పరిధిలో గుమ్మిడిపూండి సిప్కాట్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఫ్రెసిన్ హైడ్రాలిక్ సంస్థ కార్యాలయం, చెంగల్పట్టు జిల్లా పరిధిలో మధురాంతకం ఇందిరాపురంలోని కాన్‌కార్డ్ టెక్స్‌టైల్స్ కార్యాలయం, కాంచీపురం జిల్లా పరిధిలో కాంచీపురం ఏకాంబరనాథర్ సన్నిధి వీధిలోని నారాయణగురు మెట్రిక్యులేషన్ మహోన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ఈపీఎఫ్ సభ్యులు, కొత్తగా పరిశ్రమలు ప్రారంభించిన సంస్థలు పాల్గొని, తమ సమస్య తెలిపి పరిష్కరించుకోవాలని ఈపీఎఫ్ సంస్థ ప్రకటనలో తెలిపింది.

గిరిజన ప్రాంతాల సహా అన్ని చోట్లా 4జీ సేవలు

● నేడు ఒడిశాలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ



పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 4జీ సేవలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఒడిశాలో జరిగే కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సేవలు ప్రారంభించనున్నారు. ఈ విషయమై బీఎస్ఎన్ఎల్ తమిళనాడు సర్కిల్, చెన్నై టెలికాం చీఫ్ జనరల్ మేనేజర్ పార్థిబన్ శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డిజిటల్ భారత్ నిధుల సాయంతో రాష్ట్రంలోని మారుమూల గ్రామాలకు 4జీ సేవలు అందజేయనున్నామన్నారు. రాష్ట్రంలో 4జీ సేవలకు 620 గ్రామాలు గుర్తించగా, వాటిలో 222 గ్రామాల్లో కొత్త టవర్లు, 35 ప్రాంతాల్లో 2జీ టవర్లను అప్‌గ్రేడ్ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 188 రెవెన్యూ గ్రామాలు, అటవీ ప్రాంతాల్లోని 21 గ్రామాల్లోని 29 ప్రదేశాల్లో మొబైల్ టవర్లు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. చెన్నై, కాంచీపురం, తిరువళ్లూర్, చెంగల్పట్టు జిల్లాల్లోని 19 గ్రామాల్లోని మొబైల్ టవర్లను 4జీ సేవలకు అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఈ పథకం ద్వారా నీలగిరి, సత్యమంగళం, కొల్లిమలై, ఏర్కాడు, పచ్చమలై, కల్వరాయన్‌మలై, జవ్వాదుమలై, జరుగుమలై, మార్తాండం పిల్లిగుండు తదితర ప్రాంతాల్లోని మారుమూల గ్రామాలకు 4జీ సేవలు అందించాలని నిర్ణయించామన్నారు. ఈ పథకంలో అన్ని 4జీ టవర్లు ఉన్న ప్రాంతాల్లో 24 గంటలు నిరంతరాయంగా మొబైల్ సేవలు అందించేలా సౌర విద్యుత్, బ్యాటరీ, పవర్ జనరేటర్ తదితర పరికరాలు అమర్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు 254 కొత్త 4జీ మొబైల్ టవర్ల ఏర్పాటు చేశామని, మిగిలిన ప్రాంతాల్లో డిసెంబరులోగా ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. స్వదేశీయంగా తయారుచేసిన 4జీ పరికరాలు ఉపయోగించడం ద్వారా స్వావలంబన, డిజిటల్ మౌలిక సదుపాయాల కల్పనలో బీఎస్ఎన్ఎల్ వేగవంతమైన పురోగతి సాధించిందన్నారు. మారుమూల గ్రామాలకు కూడా వేగవంతమైన, నమ్మకమైన మొబైల్ అందించడమే బీఎస్ఎన్ఎల్ లక్ష్యమని సీజీఎం పార్థిబన్ తెలిపారు.

అదనపు ఛార్జీలు వసూలు చేయొద్దు

● ఆమ్నీ బస్సులకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ హెచ్చరిక

ప్యారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఆయుధపూజ, విజయదశమి, వరుస సెలవుల్లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలుంటాయని ఆమ్నీ బస్సుల యజమానులను తమిళనాడు ప్రభుత్వ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆర్.గజలక్ష్మి హెచ్చరించారు. రాష్ట్రంలో వృత్తిరీత్యా పలు జిల్లాల్లో నివసిస్తున్న ప్రజలు పండుగలు, వరుస సెలవుల్లో కుటుంబ సభ్యులతో కలిసి సొంతూళ్లకు వెళ్తుంటారు. పండుగ రద్దీని ఆసరాగా చేసుకున్న ఆమ్నీ బస్సుల యజమానులు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నారు. దీనిపై పలువురు ఫిర్యాదు చేసినా.. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఈ నేపథ్యంలో, అక్టోబర్ 1,2వ తేదీల్లో ఆయుధపూజ, విజయదశమి పండుగలను పురస్కరించుకుని వరుస సెలవుల్లో నడిపే ఆమ్నీ బస్సుల్లో అధిక ఛార్జీల వసూలును అడ్డుకునేలా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ గజలక్ష్మి శుక్రవారం ఆర్టీఏ కార్యాలయ అధికారులు, మోటారు వాహన అధికారులు, రవాణా చెక్‌పోస్టుల అధికారులతో ప్రత్యేక కమిటీలను నియమించారు. ఈ కమిటీలు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనాలు, అధిక ఛార్జీలు వసూలు చేసే ఆమ్నీ బస్సులను అదుపులోకి తీసుకుని జరినామా వసూలు చేస్తారని, ప్రయాణికుల రద్దీని బట్టి ప్రభుత్వ రవాణా సంస్థల బస్సులను అదనంగా నడిపేందుకు చర్యలు చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు.

హాస్టళ్లలో ఆహార నాణ్యత పరిశీలన



హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రభుత్వ బాలికల హాస్టళ్లలో కలెక్టర్ సుబ్బులక్ష్మి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, విద్యార్థులకు అందజేస్తున్న ఆహార పదార్థాలు, వసతులపై హాస్టల్ నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కలశపాక్కం ఎమ్మెల్యే అగ్రి ఎస్ఎస్.కృష్ణమూర్తి పాల్గొని ఆహార నాణ్యత పరిశీలించారు. ఇందులో ఎమ్మెల్యేలు చంద్రన్, జయరామన్ సహా పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆర్యపాక్కంలో ఘనంగా సుమంగళి పూజ



ప్రత్యేక అలంకరణలో విద్యారంభ జ్ఞాన సరస్వతి అమ్మవారు

ప్యారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కం గ్రామంలోని విద్యారంభ జ్ఞాన సరస్వతి ఆలయంలో నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం సుమంగళి పూజ నిర్వహించారు. ఆలయ మహామండపంలో అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో పూజలందుకున్నారు. కళాకారులు కె.విజయలక్ష్మి, మణిమాలారావు వీణానాదం అనంతరం 108 మంది ముత్తైదువులతో సుమంగళి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి నూతన చీరలు పంపిణీ చేసి సత్కరించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు గురుస్వామి భక్తవత్సలం, ధర్మకర్త పీవీ.కృష్ణారావు పర్యవేక్షించి భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

ప్యారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): హౌరా నుంచి తిరుచ్చికి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సమయంలో ఆర్పీఎఫ్ పోలీసులు ఆ రైలు అన్‌రిజర్వు బోగీలోని బ్యాగు నుంచి 3 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఉదయం ఎగ్మూర్ రైల్వేస్టేషన్ 6వ ప్లాట్‌ఫామ్‌లో ఆగిన ఎక్స్‌ప్రెస్‌లో ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీ చేశారు. ఇంజన్ వెనుకనున్న ఆర్డినరీ బోగీలో పడివున్న సంచిలో తనిఖీ చేసి అందులోని 3కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా గత మూడురోజులుగా పలు రైళ్లలో అక్రమంగా తరలించిన గుట్కా, పాన్‌మసాలా తదితర పొగాకు ఉత్పత్తులను అన్నానగర్‌లోని ఎక్సైజ్ పోలీసుల వద్ద అప్పగించారు.

ప్రస్తుత కూటమి విడిపోవచ్చు...!

● మాజీ మంత్రి కడంబూరు రాజా



పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికలకు ఇంకా సమయం ఉందని, చివరి నిమిషంలో కూటమిలోకి పలు పార్టీలు చేరవచ్చని, ప్రస్తుతం ఉన్న కూటమి విడిపోవచ్చని మాజీ మంత్రి, అన్నాడీఎంకే తూత్తుకుడి జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్యే కడంబూరు రాజా తెలిపారు. తూత్తుకుడి జిల్లా తాళముత్తునగర్‌లో గురువారం అన్నాడీఎంకే కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న కడంబూరు రాజా మీడియాతో మాట్లాడుతూ... 2026 శాసనసభ ఎన్నికల ప్రచారం ప్రారంభించిన తొలి పార్టీ అన్నాడీఎంకే అన్నారు. కూటమి ఏర్పాటుకు పార్టీలు ఆందోళన చెందుతున్న తరుణంలో, ప్రజలను నమ్మి ఎన్నికల బరిలో నిలిచిన పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఇప్పటివరకు 154 నియోజవర్గాల్లో ప్రచారం పూర్తిచేశారని తెలిపారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండడంతో చివరి నిమిషంలో పలు పార్టీలు కూటమిలోకి చేరవచ్చని లేదా ఉన్న కూటమి విడిపోవచ్చన్నారు.

అన్ని పార్టీలతో సఖ్యతగానే ఉన్నాం

ఏ కూటమి నుంచీ ఆహ్వానం రాలేదు ● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత



'సుడలైమాడు' వేషంతో వచ్చిన పార్టీ కార్యకర్తకు నగదు అందజేస్తున్న ప్రేమలత

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్ని పార్టీలతోనూ డీఎండీకే స్నేహపూర్వకంగానే మెలగుతోందని, అయినప్పటికీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పొత్తుపై చర్చించేందుకు ఇప్పటివరకు ఏ కూటమి నుంచి కూడా తమకు ఆహ్వానం అందలేదని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత అన్నారు. శుక్రవారం ఉదయం కోయంబేడులోని పార్టీ కార్యాలయం వద్ద తన ప్రచార వాహనాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జనవరి 9న కడలూరులో పార్టీ మహానాడు జరుపనున్నామని, ఆ సభలోనే ఏ కూటమితో పొత్తుపెట్టుకుంటామనే విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తానన్నారు. నటుడు విజయ్ రాకతో రాష్ట్ర రాజకీయాల్లో తప్పకుండా మార్పు వస్తుందన్నారు. ఇటీవల సీఎం స్టాలిన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత తాను ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించానని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుటుంబ సభ్యులు, తమ కుటుంబ సభ్యుల మధ్య ఎన్నో యేళ్లుగా సన్నిహిత సంబంధాలున్నాయని, కెప్టెన్‌తో తన వివాహాన్ని జరిపింది కరుణానిధే అనే విషయం అందరికీ తెలిసిందేనని ఆమె చెప్పారు. విజయ్ సినిమాలలో రాణించినట్లు రాజకీయాల్లో రాణించడం సులువైన విషయం కాదని చెప్పారు.

రాందాస్ హత్యకు కుట్ర!

● అన్బుమణి వర్గీయులపై పీఎంకే ఎమ్మెల్యే ఆరోపణ

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్బుమణి వర్గీయులు సామాజిక మాధ్యమాల్లో రాందాస్‌ను హతమవుతారని పోస్ట్ చేస్తున్నారంటూ పీఎంకే ఎమ్మెల్యే అరుళ్ సంచలన ఆరోపణలు చేశారు. నగరంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పీఎంకే అధ్యక్షుడు రాందాస్‌కు సొంతమైన తైలాపురం ఇంట్లో సీక్రెట్ వాయిస్ రికార్డర్, సీసీ టీవీ దృశ్యాలను అన్బుమణి వర్గీయుల దగ్గర ఉందని, ఈ వ్యవహారంపై పోలీసులు సత్వరం చర్యలు చేపట్టాలన్నారు. అన్బుమణి వర్గీయులు సామాజిక మాధ్యమాల్లో రాందాస్‌ను హతమారుస్తాంటూ వ్యాఖ్య లు పోస్ట్ చేస్తున్నారని, ఇలాంటి వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్న వారిపై పోలీసులు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అరుళ్ కోరారు.

క్వారీ ఏర్పాటుపై ప్రజల నిరసన

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లాలో రాళ్ల క్వారీ ఏర్పాటును నిరసిస్తూ 8 గ్రామాల ప్రజలు నిరసన చేపట్టారు. మారాయిపాళ్యంలో రాళ్ల క్వారీ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. క్వారీ ఏర్పాటుతో భూగర్భ జలాలు తగ్గుతాయని, పర్యావరణం కూడా దెబ్బతింటోదని ఆవేదన వ్యక్తం చేసిన ఆ ప్రాంత ప్రజలు, క్వారీ ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కానీ క్వారీ పనులు ప్రారంభం కావడంతో మారాయిపాళయం, చుట్టుపక్కల 8 గ్రామాల ప్రజలు శుక్రవారం వాహనాల్లో ఈరోడ్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని రాస్తారోకో చేపట్టారు. సమాచారం అందుకున్న అధికారులు అక్కడకు చేరుకుని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

మెట్రోరైళ్లలో ఉద్యోగ ప్రకటనలు నమ్మొద్దు: సీఎంఆర్ఎల్

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో ఉద్యోగావకాశాలున్నాయనే ప్రచారం నమ్మవద్దని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) తెలిపింది. ఈ మేరకు సీఎంఆర్ఎల్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో.... మెట్రో రైళ్లలో ఉద్యోగాల భర్తీకి వ్యక్తులు, సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోలేదని తెలిపింది. ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ http://chennaimetrorail.org/careers అధికార వెబ్‌సైట్‌లోను, వారపత్రికలు, ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రచురిస్తామన్నారు. ఇటీవల కాలంలో మెట్రోలో ఉద్యోగాలు భర్తీ చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రకటనలు నమ్మరాదని సీఎంఆర్ఎల్ విజ్ఞప్తి చేసింది.

లక్ష్మీ అలంకారంలో కొల్లాపురియమ్మన్



లక్ష్మీదేవి అలంకారంలో కొల్లాపురియమ్మన్

తిరుత్తణి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో కొలువైన కొల్లాపురియమ్మన్ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు జయకృష్ణన్, ఉభయకర్తలు హరిగోపాల్, సభ్యులు జ్యోతి, గోమతి, దినేష్, కవిత, మాధవి, నవీన్, డాక్టర్ మిధున్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేశారు.

మూడో వ్యక్తితో వివాహేతర సంబంధం

● కుమార్తెను కడతేర్చిన తండ్రి



హతురాలు ప్రవీణ (ఫైల్‌ఫొటో) - తండ్రి తంగయ్య

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరుసగా వివాహేతర సంబంధాలతో తనకు చెడ్డ పేరు తీసుకొస్తోందని ఆగ్రహించిన ఓ తండ్రి తన కుమార్తెను హతమార్చిన ఘటన తేని జిల్లాలో చోటుచేసుకుంది. మార్కండయన్‌కోట ప్రాంతానికి చెందిన ప్రవీణ విభేదాల కారణంగా భర్తను వదిలి పదేళ్లుగా మరో వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఈ క్రమంలో, తిరుప్పూర్‌కు చెందిన మరో వ్యక్తితో ప్రవీణకు వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంపై ఆమెను తండ్రి తంగయ్య పలుమార్లు మందలించాడు. అయినా అతడి మాటల్ని ఆమె పట్టించుకోలేదు.. దీంతో ఆగ్రహం చెందిన తండ్రి, శీతలపానీయంలో విషం కలిపి ప్రవీణకు తాగించి, ఆమె స్పృహతప్పిన సమయంలో చీరతో గొంతు నులిమి హతమార్చాడు. ఈ విషయం ఎవరికి తెలియకుండా కుమార్తె మృతదేహాన్ని గ్రామ శివారులో పడవేశాడు. పోలీసుల విచారణలో... కుమార్తెను తానే హతమార్చినట్లు తంగయ్య అంగీకరించడంతో అతడిని గురువారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐదు గంటలు ఆలస్యంగా అండమాన్ విమానం

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో నగరం నుంచి అండమాన్ వెళ్లాల్సిన విమానం ఐదు గంటలు ఆలస్యంగా బయల్దేరింది. నగరం నుంచి శుక్రవారం ఉదయం 7.20 గంటలకు అండమాన్ వెళ్లేందుకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం సిద్ధంగా ఉంది. అందులో ప్రయాణించేందుకు రిజర్వేషన్ చేసుకున్న 158 మంది ప్రయాణికులు తనిఖీలు పూర్తిచేసుకుని విమానంలోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ, అండమాన్‌లో వాతావరణం అనుకూలించకపోవడంతో 11 గంటలకు విమానం బయల్దేరుతుందని తెలిపిన అధికారులు, ప్రయాణికులను విశ్రాంతి గదులకు తరలించారు. వారిలో కొందరు ప్రయాణికులు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. అండమాన్‌లో పలు విమానాలు ల్యాండింగ్ అవుతున్నట్లు సమాచారం ఉందంటూ వాదనకు దిగారు. అందుకు అధికారులు, ఎయిర్ ఇండియా విమానం పెద్దదని, ప్రయాణికుల భద్రత దృష్ట్యా వాతావరణం అనుకూలించిన తర్వాత బయల్దేరి వెళుతుందని తెలిపారు. ఈ క్రమంలో, ఐదు గంటల అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు అండమాన్ విమానం బయల్దేరి వెళ్లింది.

మెదడు నిర్జీవమైన వ్యక్తి అవయవదానం



ఏలుమలై మునిస్వామి (ఫైల్‌ఫొటో)

వేలూరు, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స ఫలించక మెదడు నిర్జీవమైన ఓ వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. వేలూరు జిల్లా వాలాజాపేట సమీపంలోని తాంగల్‌కు చెందిన ఏలుమలై మునిస్వామి (47) ఇటీవల బైక్‌లో వెళ్తుండగా ప్రమాదానికి గురైయ్యాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన అతడిని చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. గురువారం రాత్రి 9.28 గంటలకు అతని మెదడు నిర్జీవమైందని వైద్యులు నిర్ధారించారు. దీంతో ఏలుమలై మునిస్వామి కుటుంబసభ్యుల అనుమతితో వైద్యులు ప్రత్యేక చికిత్స ద్వారా అవయవాలను తీసి, రాణిపేటలోని సీఎంసీ ప్రభుత్వాసుపత్రికి ఆసుపత్రికి తరలించి అతని భౌతిక కాయాలని అంజలి ఘటించారు.

నాటు తుపాకీతో కోడిని కాల్చేందుకు యత్నం

● తూటా తగిలి యువకుడి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాటు తుపాకీతో కోడిని కాల్చుతున్న సమయంలో, గుండు గురితప్పి యువకుడికి తగలగా అతను ఘటనాస్థలంలోనే మృతిచెందారు. కళ్లకుర్చి జిల్లా కల్వరాయన్ కొండ ప్రాంతాలోని మేల్‌మదూర్ గ్రామానికి చెందిన అన్నామలై, తన అల్లుడికి కోడి కూర చేయాలని, దానికోసం తాను సంరక్షిస్తున్న కోళ్లను పట్టుకునేందుకు యత్నించగా, అవి చిక్కలేదు.. దీంతో, నాటు తుపాకితో కోడిని కాల్చేందుకు యత్నించాడు. తుపాకి గుండు కోడికి తగులకుండా పక్క ఇంటి వరండాలో నిద్రపోతున్న ప్రకాష్ అనే యువకుడి తలలో చొచ్చుకుపోయింది. దీంతో అతడు ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు, ప్రకాష్ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి అన్నామలైను అరెస్ట్ చేసి, నాటు తుపాకీ స్వాధీనం చేసుకున్నారు.

లైంగిక వేధింపుల కేసు: యువకుడికి 22 ఏళ్ల జైలు

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడికి న్యాయస్థానం 22 ఏళ్ల జైలుశిక్ష విధించింది. తిరుచ్చి జిల్లా మనప్పారై సూలియంపట్టి గ్రామానికి చెందిన భారతి అనే యువకుడు 14 ఏళ్ల బాలికను వివాహం చేసుకుంటానని నమ్మించి ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో మనప్పారై మహిళ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసి, భారతిని అరెస్ట్ చేశారు. ఈ కేసు తిరుచ్చి పోక్సో కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి 22 ఏళ్ల జైలుశిక్ష, రూ.22వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి షణ్ముగప్రియ గురువారం తీర్పు వెలువరించారు.

● టీవీకే జెండా వ్యవహారం...

విజయ్‌కు మద్రాసు హైకోర్టు నోటీసులు

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జెండాకు సంబంధించిన దాఖలైన అప్పీలు పిటిషన్‌పై ఆరు వారాల్లోగా అఫిడవిట్ దాఖలుచేయాలని మద్రాసు హైకోర్టు విజయ్‌కు నోటీసు జారీచేసింది. తొండై మండల సాన్రోర్ ధర్మ పరిపాలన సభ తరఫున మద్రాసు హైకోర్టులో ఓ అప్పీలు పిటిషన్ వేసింది. అందులో... తమ సభ వినియోగిస్తున్న జెండాలాగే టీవీకే జెండా ఉందని, అందువల్ల టీవీకే జెండాలో ఎరుపు, పసుపు రంగులు వినియోగించడంపై స్టే విధించాలని కోరారు. ఈ పిటిషన్ శుక్రవారం విచారించిన న్యాయస్థానం, ఈ వ్యవహారంపై ఆరు వారాల్లో బదులు పిటిషన్ దాఖలుచేయాలని టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు ఉత్తర్వులు జారీచేసింది.

● విచారణలో బాలుడి మృతి కేసు ..

సీఐ, ముగ్గురు కానిస్టేబుళ్లకు 11 ఏళ్ల జైలుశిక్ష

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేసు విచారణకు తీసుకెళ్లిన బాలుడి మృతి కేసులో సీఐ సహా ముగ్గురు కానిస్టేబుళ్లకు 11 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ మదురై కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. మదురై కొచ్చడై ప్రాంతానికి చెందిన జయ పెద్ద కుమారుడు ముత్తు కార్తికేయన్ (17)ను ఓ కేసు విచారణ కోసం ఎస్ఎస్ కాలనీ పోలీసుస్టేషన్‌కు తెసుకెళ్లారు. విచారణ సమయంలో కార్తికేయన్‌ను పోలీసులు కొట్టినట్లు తెలిసింది. తీవ్రగాయాలపాలైన కార్తికేయన్‌ను ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స ఫలించక మృతిచెందాడు. తన కుమారుడి మృతికి కారకులైన పోలీసులపై చర్యలు చేపట్టాలని కోరుతూ బాలుడి తల్లి జయ కోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసు విచారించిన న్యాయమూర్తులు, కేసు విచారణ సీబీసీఐడీకి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన సీబీసీఐడీ పోలీసులు, మదురై ఎస్ఎస్ కాలనీ పోలీసు స్టేషన్ సీఐ అలెక్స్ రాజ్, కానిస్టేబుళ్లు సతీష్, రవి, రవిచంద్రన్ తదితర నలుగురిపై కేసు నమోదుచేశారు. ఈ కేసు మదురై 5వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొన్న నలుగురికి 11 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి జోసఫ్ జాయ్ తీర్పు వెలువరించారు. అలాగే, ఈ కేసులో సాక్ష్యాలు చెరిపేసేందుకు యత్నించిన కానిస్టేబుళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, పోస్టుమార్టం సమయంలో శరీరంపై ఉన్న గాయాలు దాచేందుకు యత్నించిన ప్రభుత్వ వైద్యులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలంటూ న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఇన్‌స్పెక్టర్ మృతి



భానుమతి (ఫైల్‌ఫొటో)

పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్‌లో లారీ ఢీకొన్న ఘటనలో మహిళా ఇన్‌స్పెక్టర్ మృతిచెందారు. కోయంబత్తూర్ దక్షిణం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ గా భానుమతి (52) పనిచేస్తున్నారు. శుక్రవారం ఉదయం కామరాజర్ రోడ్డు సింగానల్లూర్ బస్టాండ్ సమీపంలో భానుమతి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా బియ్యం లోడుతో వచ్చిన వాహనం బైక్‌ను ఢీకొనడంతో భానుమతికి తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు ఆమెను వెంటనే అంబులెన్స్‌లో కోవైలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రికి తరలించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు, అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై సింగానల్లూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పళ్లిపట్టులో నకిలీ డాక్టర్ అరెస్ట్



నకిలీ డాక్టర్ వడివేలు

తిరుత్తణి, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు ప్రాంతంలో ఆస్పత్రి నడుపుతున్న ఓ నకిలీ డాక్టర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా... డాక్టర్ విద్య అభ్యసించకుండా, ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా ఆ ప్రాంతంలో ముత్తుకుమరన్ అనే పేరు మీద నకిలీ డాక్టర్ పట్టాతో వడివేలు (58)అనే వ్యక్తి ఆస్పత్రిని నడుపుతున్నాడనే సమాచారంతో గురువారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఆస్పత్రి నడుపుతున్న వడివేలను పోలీసులు అరెస్టు చేసి, వైద్య పరికరాలు, రూ.20వేల మెడికల్ కిట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరిచి అతడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

నలుగురు రామేశ్వరం జాలర్ల విడుదల

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరం జాలర్లు నలుగురికి జరిమానా విధిస్తూ శ్రీలంక న్యాయస్థానం విడుదల చేసింది. సరిహద్దులు దాటి చేపలు పట్టారంటూ రామేశ్వరానికి చెందిన ఐదుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసింది. వీరిని శ్రీలంక కోర్టులో హాజరుపరచగా, ఇద్దరు జాలర్లకు రూ.2.50 లక్షలు (శ్రీలంక కరెన్సీలో), మరో ఇద్దరు జాలర్లకు తలా రూ.50,000 (శ్రీలంక కరెన్సీలో) జరిమానా విధించింది. పడవ యజమాని రెండో సారి పట్టుబడిన కారణంగా ఏడాది జైలుశిక్ష విధిస్తూ శ్రీలంక న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది.

అధిక ధరకు స్నాక్స్ విక్రయం

● రూ.60,040 జరిమానా

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అధిక ధరకు స్నాక్స్ విక్రయించిన సినిమా థియేటర్‌కు వినియోగదారుల ఫోరం రూ.60,040 జరిమానా విధించింది. విల్లుపురం జిల్లా దిండివనంలోని కన్నయ్య థియేటర్‌కు జ్ఞానవేల్ అనే వ్యక్తి ఈ నెల 13వ తేది సినిమాకు వెళ్లాడు. ఆ సమయంలో, థియేటర్‌లో విక్రయిస్తున్న స్నాక్స్ ఎమ్మార్పీ ధర కన్నా రూ.40 అధికంగా తీసుకున్నారు. దీంతో, జ్ఞానవేల్ జిల్లా వినియోగదారుల ఫోరంలో పిటిషన్ వేశారు. దీనిని విచారించిన న్యాయస్థానం, వినియోగదారుడి నుంచి అదనంగా తీసుకున్న రూ.40, కేసు ఖర్చులకు రూ.10,000లతో సహా రూ.60,040 జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

సైన్స్ టెక్నాలజీ పరిశోధనలో మరింత ముందుకు

● వీఐటీ వ్యవస్థాపకులు విశ్వనాథన్



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న అబుధాబి మున్సిపల్, పరిపాలనా శాఖ మంత్రి మాజిద్ అలీ ఈల్ మన్సౌరి

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు సైన్స్, టెక్నాలజీ పరిశోధనల్లో గణనీయమైన పురోగతి అవసరమని వీఐటీ వ్యవస్థాపకులు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్ పేర్కొన్నారు. వేలూరు వీఐటీలో శుక్రవారం ప్రారంభమైన మూడు రోజుల 'టెక్నో-మేనేజ్‌మెంట్ ఫెస్ట్ గ్రావిటాస్ 2025' సదస్సుకు అధ్యక్షత వహించిన విశ్వనాథన్ మాట్లాడుతూ.. 1984లో కేవలం 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన వీఐటీ ... వేలూరు, భోపాల్, చెన్నై, అమరావతి ప్రాంగణాల్లో లక్ష మంది విద్యార్థులకు విద్యనందించే స్థాయికి ఎదిగిందని గుర్తు చేశారు. అధిక స్థాయిలో విద్యార్థులను ఎందుకు చేర్చుకుంటున్నారని కొందరు అడిగారని, 146 కోట్ల జనాభా వున్న దేశంలో వీలైనంత ఎక్కువమందికి నాణ్యమైన విద్య అందించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, అధ్యాపక నియామకాల అధిక ఖర్చుల కారణంగా ప్రభుత్వ సంస్థలు తరచూ ప్రవేశాలను పరిమితం చేస్తాయని, అనేక రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు వెయ్యి నుంచి 2 వేల మంది విద్యార్థులను మాత్రమే చేర్చుకుంటాయన్నారు. అయితే ఈ పరిస్థితి మారాల్సి వుందన్నారు. పేద, మధ్యతరగతి వారితో సహా అందరికీ విద్య అందుబాటులో వుండాలన్నారు. 50 రాష్ట్రాలతో కూడిన యునైటెడ్ స్టేట్స్‌లోని కాలిఫోర్నియాలో మాత్రమే 4 కోట్ల జనాభా ఉండగా, 4 ట్రిలియన్ డాలర్ల జీడీపీ వుందని తెలిపారు. 146 కోట్ల జనాభా కలిగిన భారత్ అటువంటి ఆర్థికశక్తిగా మారేందుకు అనుగుణంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దీనిని సాధించడానికి మనం సైన్స్, టెక్నాలజీ పరిశోధనలపై దృష్టి పెట్టాల్సివుందని వివరించారు. చిన్న పరిమాణంలో వున్నప్పటికీ అబుధాబి ఆర్థికంగా సంపన్నమైందని, భారత్ తలసరి ఆదాయం రూ.2,900తో పోలిస్తే అక్కడి తలసరి ఆదాయం రూ.75వేలుగా వుందన్నారు. అక్కడ జనాభాలో 20 శాతం మాత్రమే స్థానికులుండగా, 80 శాతం ప్రవాసులని వివరించారు. వీరిలో చాలామంది భారతీయులున్నారని, యూఏఈ చమురు, గ్యాస్ నిల్వల్లో 95 శాతంతో అబుధాబి ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు. భారత్ అలాంటి నమూనాల నుంచి నేర్చుకోవాల్సి వుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అబుధాబి మున్సిపల్, పరిపాలనా శాఖ మంత్రి మాజిద్ అలీ ఈల్ మన్సౌరి ఆవిష్కరణ పాత్రను హైలైట్ చేశారు. ఇంటర్‌నెట్ నుంచి పునరుత్పాదక శక్తి వరకు, అన్ని ఆవిష్కరణలు శాస్త్రవేత్తల అభిరుచి, పట్టుదల నుంచి ఉద్భవించాయని, విద్యార్థులు ప్రపంచ పౌరులుగా మారడానికి, స్థిరత్వానికి దోహదపడటానికి సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. వారు కృత్రిమ మేధస్సు, బయోటెక్నాలజీ, అంతరిక్ష అన్వేషణ, వాతావరణ మార్పుల్లో సవాళ్లను పరిష్కరించాలని సూచించారు. ఈ నెల 28 వరకు జరుగనున్న ఈ సదస్సులో 207 ఈవెంట్‌లు, 57 వర్క్‌షాప్‌లు, 51 హ్యాకథాన్‌లు, రోబోట్ యుద్ధాలు, డ్రోన్ షోలు జరుగనున్నాయి. సుమారు 40 వేల మంది విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో 'న్యూస్ 18' మేనేజింగ్ ఎడిటర్ ఆనంద్ నరసింహన్, వీఐటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంధ్యా పెంటారెడ్డి, మార్గిమస్ ఇండియా కంట్రీ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ భీమవరపు, వైస్ ఛాన్సలర్ డాక్టర్ కాంచన భాస్కరన్, ప్రొ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ జయబా, డాక్టర్ పార్థసారథి, కోఆర్డినేటర్ షర్మిల్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలకు పవిత్ర గొడుగుల యాత్ర

● ప్రారంభించిన ఐజీ నరేంద్రనాయర్

ప్యారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైభవంగా జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ప్రధానాంశమైన గరుడోత్సవం రోజున సమర్పించేందుకు తిరుపతి అంబ్రిల్లా ఛారిటీస్ (టీయూసీ) తరుపున ప్రత్యేకంగా తయారుచేయించిన గొడుగుల ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. జార్జిటౌన్ కందప్పవీధిలోని టీయూసీ కార్యాలయంలో గురువారం రాత్రి ట్రస్టీ శీలం వరదరాజులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఐజీ నరేంద్ర నాయర్ పాల్గొని గొడుగుల ఊరేగింపును రాత్రి 8.30 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభించారు. మద్రాస్ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తులు ఎం.గోవిందరాజన్, ఇ.పద్మనాభన్, మాజీ డీజీపీ కాళిముత్తు విశిష్ఠ అతిథులుగా హాజరయ్యారు. భక్తుల గోవిందనామస్మరణలు, మేళతాళాల మధ్య ఈ ఊరేగింపు ఆదియప్పన్‌వీధి, బందర్‌వీధి, నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌రోడ్డు, ఆచారప్పన్‌వీధి, గోవిందప్పనాయర్‌వీధి, వరదాముత్తియప్పన్‌వీధుల మీదుగా మళ్లీ టీయూసీ కార్యాలయానికి చేరుకుంది. ఊరేగింపు మార్గంలో ఉన్న కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)కు చేరుకున్న గొడుగుల ఊరేగింపును ట్రస్టీలు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతించి పూజలు చేసి సాగనంపారు. రాత్రి 10.30 గంటలకు ప్రత్యేక వాహనం ద్వారా 11 గొడుగులతో తిరుచానూరుకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం ఉదయం అక్కడినుంచి కాలినడకన బయలుదేరి తిరుమల కొండపైకి చేర్చి ఈ నెల 28న తేదీ ఆదివారం టీటీడీ అధికారులకు గొడుగులను సమర్పిస్తారు. తిరుమల సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ప్రతిష్ఠాత్మకమైన ఐదోరోజు అశేషభక్తజనం మధ్య నేత్రపర్వంగా నిర్వహించే గరుడసేవలో అలంకరించేందుకు వంశపారంపర్యంగా గొడుగులు సమర్పించే కైంకర్యం 186యేళ్లుగా కొనసాగుతోందని, ఇది తమ వంశీయులకు కలిగిన అదృష్టంగా భావిస్తున్నట్లు శీలం వరదరాజులు తెలిపారు.


గొడుగుల యాత్ర ప్రారంభోత్సవంలో ఐజీ నరేంద్ర నాయర్, జస్టిస్ పద్మనాభన్, శీలం వరదరాజులు తదితరులు

ఆలంకుళం విద్యార్థినికి సొంతిల్లు

● సీఎం స్టాలిన్ ఉత్తర్వు


సభలో ప్రసంగిస్తున్న విద్యార్థిని ప్రేమ

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నాన్ ముదల్వన్ పథకంలో శిక్షణ పొంది ఉద్యోగంలో చేరి తొలి జీతాన్ని తల్లిదండ్రులకు కానుకగా ఇచ్చిన ప్రేమ అనే విద్యార్థిని సొంతింటి కలను నెరవేర్చేలా ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆలంకుళం సమీపంలోని కళనీరుకుళంకు చెందిన విద్యార్థిని ప్రేమ తన తల్లిదండులు పెంకుటిల్లులో దయనీయ స్థితిలో గడుపుతున్నారంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నెహ్రూ ఇండోర్ స్టేడియంలో గురువారం 'విద్యలో తమిళనాడు అగ్రస్థానం' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో సభాముఖంగా బాధను వ్యక్తం చేసింది. దీనిపై స్పందించిన స్టాలిన్ కలైంజర్ గృహనిర్మాణ పథకం కింద ప్రేమ తల్లిదండ్రులకు ఓ ఇల్లు నిర్మించి ఇవ్వనున్నట్లు తన ఎక్స్‌పేజీలో ప్రకటించారు.

కుట్రాలం జలపాతాల్లో వరద

● రెండో రోజూ పర్యాటకుల స్నానాలపై నిషేధం



చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా పడమటి కనుమల ప్రాంతాల్లో కుండపోత వర్షాలు కురవటంతో కుట్రాలం జలపాతాల్లో వరద దృశ్యాలు నెలకొన్నాయి. కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద నీరు ఉధృతంగా పడుతుండటంతో గురువారం పర్యాటకులు స్నానం చేయకుండా అధికారులు నిషేధం విధించారు. గురువారం రాత్రి జలపాతం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం జలపాతం వద్ద నీటి ధారలు వేగంగా పడ్డాయి. దీంతో శుక్రవారం కూడా జలపాతాల వద్ద స్నానం చేయడానికి పర్యాటకులను అనుమతించలేదు. దీనితో పర్యాటకులు నిరాశతో తిరుగుముఖం పట్టారు.

ముగప్పేర్ వెస్ట్‌లో 'సీహెచ్‌సీ ఫార్మసీ మినీ' ప్రారంభం

చెన్నై, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హెల్త్‌వాచ్ టెలీ డయాగ్నోస్టిక్స్ సంస్థ నగరంలోని ముగప్పేర్ వెస్ట్ ప్రాంతంలో 'సీహెచ్‌సీ ఫార్మసీ మినీ' పేరుతో మూడో బ్రాంచిని శుక్రవారం ఉదయం ప్రారంభించింది. ఈ ఫార్మసీని సంస్థ సీఎఫ్ఓ సీఏ జయశ్రీ గాండీబన్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.సెంథిల్ గాండీబన్ మాట్లాడుతూ ఈ ఫార్మసీ ద్వారా ఇళ్లవద్దకే నాణ్యమైన ఔషధాలను, రోజువారీ నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడంతోపాటు, ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తామన్నారు. ఈ ఫార్మసీలో రక్తసేకరణ, పేథాలజీ టెస్ట్‌లు, వృద్ధులకు ఫిజియోథెరపీ, నర్సింగ్ సేవలను కూడా లభిస్తాయన్నారు. రోజూ ఉదయం 7 నుండి రాత్రి 11 గంటల దాకా ఈ కొత్త ఫార్మసీ పనిచేస్తుందని, 74300 33003 అనే నెంబర్‌కు ఫోన్ చేసి ఈ ఫార్మసీ సేవలను పొందవచ్చునని వివరించారు.

'సీహెచ్‌సీ ఫార్మసీ మినీ' ప్రారంభిస్తున్న హెల్త్‌వాచ్ టెలీ డయాగ్నోస్టిక్స్ సీఎఫ్ఓ జయశ్రీ గాండీబన్


భక్తిశ్రద్ధలతో కన్య పూజ

పాయారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): నవరాత్రుల్లో భాగంగా రెండేళ్ల నుంచి పదేళ్లలోపు బాలికలను అలంకరించి శుక్రవారం భక్తిశ్రద్ధలతో కన్య పూజ నిర్వహించారు. కొత్వాల్ బజార్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) ఆలయ ప్రాంగణంలో ఉదయం 7.30 గంటలకు వేదపారాయణం, 9 గంటలకు కన్యకా పరమేశ్వరి మూలమంత్రహోమం, 10 గంటలకు అభిషేకం అనంతరం కన్నికా పూజ నిర్వహించారు. చిన్నారులను పట్టువస్త్రాలు, చేతులకు గాజులు, పూలతో అలంకరించి ఆలయ ప్రధాన మండపంలో పాదపూజ చేశారు.అనంతరం సాయంత్రం 6 గంటలకు నాగవాహనంపై బాలా త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ క్లబ్ షావుకారుపేట చెన్నై లక్ష్మీనారాయణ పాఠశాల విద్యార్థులు భక్తిగీతాలు ఆలపించారు. కలైమామని డాక్టర్ నర్మదా వాయులీనంతో అలరించారు. ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్‌కేపీడీ ఛారిటీస్ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.


కన్యపూజలో చిన్నారులు, నిర్వాహకులు

పూంపుహార్ సముద్ర గర్భంలో భవనాలు

● ప్రాచీన తమిళుల చరిత్రపై కొనసాగుతున్న పరిశోధనలు



పెరంబూర్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లా సముద్రంలో ప్రాచీన తమిళుల చరిత్రపై 8 మంది పురావస్తు శాస్త్రవేత్తలు సహా 20 మంది బృందం విద్య, సముద్ర పరిశోధన శాఖ సలహాదారులు ప్రొఫెసర్ రాజన్ నేతృత్వంలో పరిశోధనలు కొనసాగుతున్నాయి. పూంపుహార్ ప్రాంతం మూవేందర్ కాలంలో ప్రధాన సముద్ర వాణిజ్య నౌకాశ్రయంగా ప్రసిద్ధిచెందింది. పూంపుహార్‌లో పురాతన తమిళ నాగరికతను పరిశోధించేందుకు రాష్ట్ర పురావస్తు శాఖ, ఇండియన్ మారిటైమ్ విశ్వవిద్యాలయం సంయుక్తంగా వారం రోజులుగా పరిశోధనలు జరుపుతున్నారు. ప్రొఫెసర్ రాజన్ నేతృత్వంలో పురావస్తు శాఖ అధికారులు సహా 20 మందితో కూడిన బృందం, తీరం నుంచి 5.5 కి.మీ దూరంలో 22 మీటర్ల లోతున ఏడు రోజులుగా పరిశోధనలు చేపడుతున్నారు. ఈ ప్రాంతంలో ప్రాచీన తమిళుల జాడలు, వాణిజ్య నగరం కోసం సముద్రం కింద నిర్మించిన భవనాలు కనుగొన్నామని అధికారులు తెలిపారు.

డీఎంకేలో చేరిన అన్నాడీఎంకే నేత

● సమాచార కమిటీ ఉపాధ్యక్షుడిగా నియామకం

పాయారీస్, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): అధికార డీఎంకేలో ఇటీవల చేరిన నమదు అమ్మ దినపత్రిక మాజీ సంపాదకుడు, అన్నాడీఎంకే నాయకుడు మరుదు అళగురాజ్‌ను డీఎంకే సమాచార కమిటీ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆ పార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలితల మెప్పుపొందిన పాత్రికేయుడు మరుదు అళగురాజ్ జయలలిత మరణానంతరం అన్నాడీఎంకేలో ఏర్పడిన అంతర్గత కలహాల సమయంలో ఈపీఎస్‌కు మద్దతుగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ఈపీఎస్‌తో ఏర్పడిన మనస్పర్థల కారణంగా ఆయనకు దూరమైన మరుదు అళగురాజ్ ఇటీవల సీఎం స్టాలిన్ సమక్షంలో డీఎంకేలో చేరారు. ఆయనను పార్టీ సమాచార విభాగం ఉపాధ్యక్షుడిగా నియమిస్తున్నట్టు సీఎం స్టాలిన్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.


సీఎం స్టాలిన్‌తో మరుదు అళగురాజ్

నారాయణి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం

● మంత్రి సుబ్రమణ్యం

వేలూరు, సెప్టెంబర్ 26 (ఆంధ్రజ్యోతి): వేలూరు నారాయణి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నారాయణి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం కొనియాడారు. తమిళనాడు ఆర్గాన్స్ ట్రాన్స్‌ప్లాంట్ కమిషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఆస్పత్రి వైద్యుల అభినందన కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం మాట్లాడుతూ, అవయవదానంలో నారాయణి ఆస్పత్రి సిబ్బంది పనితీరు ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బాలాజీ, కిడ్నీ విభాగం కమిటీ అధ్యక్షుడు డాక్టర్ ఎయిల్ నిలవన్ సహా ఆస్పత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.


మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఆస్పత్రి నిర్వాహకులు


గిండిలో నిర్మించిన భౌగోళిక సొరంగ శాఖ ప్రధాన కార్యాలయాన్ని సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



నుంగంబాక్కంలో 'జయశంకర్ రోడ్' నేమ్‌బోర్డ్‌ను సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

చిత్రజ్యోతి

అందుకు రెడ్ జెయింట్ సంస్థ కారణమా?

● నటుడు బోస్ వెంకట్


ఆడియో ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బోస్ వెంకట్

చిన్న బడ్జెట్ చిత్రాలకు థియేటర్లు కేటాయించకపోవడానికి హీరో, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి చెందిన రెడ్ జెయింట్ మూవీస్ కారణమంటూ జరుగుతున్న ప్రచారానికి నటుడు బోస్ వెంకట్ తెరదించారు. అన్నాడీఎంకే ప్రభుత్వంలో కూడా రెడ్ జెయింట్ నిర్మాణ సంస్థ అనేక చిత్రాలను నిర్మించిందని, ఇపుడు డీఎంకే ప్రభుత్వంలోనూ అదేపని చేస్తుందని ఆయన గుర్తు చేశారు. మహేంద్ర ఫిలిమ్ ఫ్యాక్టరీ పతాకంపై రూపొందిన 'ఇరవిన్ విళిగల్'. చిక్కల్ రాజేష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక తాజాగా నగరంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్, పేరరసు, ము.కళంజియం, బోస్ వెంకట్, నటి నమిత భర్త వీరా, నటి కోమల్ శర్మ ముఖ్య అతిథులు పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బోస్ వెంకట్ మాట్లాడుతూ, 'ఇరవిన్ విళిగల్ మూవీ 'ఊమై విళిగల్' తరహాలో విజయం సాధించాలి. ప్రస్తుతం ఏదైనా సినిమా విడుదల ప్రస్తావన రాగానే ప్రతి ఒక్కరూ రెడ్ జెయింట్ మూవీస్‌ను గుర్తు చేసుకుంటున్నారు. నిజం చెప్పాలంటే గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో కూడా రెడ్ జెయింట్ సినిమాలు నిర్మించింది. ఇపుడూ నిర్మిస్తోంది. గతంలో ఒక సినిమా జీవిత కాలం కనిష్టంగా వంద రోజులు. ఇపుడు కేవలం 10 లేదా 20 రోజులు మాత్రమే. ఆ తర్వాత ఓటీటీలో వస్తుంది. చిన్న నిర్మాతలు సినిమాలు తీసేందుకు రావొద్దంటూ నడిగర్ సంఘం ప్రధాన కార్యదర్శి విశాల్ పిలుపునిచ్చారు. దీన్ని ముందుగా ఖండించిన వ్యక్తిని నేనే. ఆయన చెప్పాల్సిన విషయాన్ని మరో అర్థం వచ్చేలా చెప్పడంతో అనేక మంది చిన్న నిర్మాతలు ఇండస్ట్రీ నుంచి పారిపోయారు. నాకు ఇపుడు సినిమా పంపిణీ గురించి తెలుసుకోవాలనివుంది. త్వరలోనే డిస్ట్రిబ్యూషన్ ప్రారంభిస్తాను. ఇపుడు ప్రతి సినిమాకు విడుదల రోజున ఏదో ఒక సమస్య వస్తోంది. మనం సినిమా విడుదల చేసేందుకు మరో వ్యక్తిని ఎందుకు సంప్రదించాలి. మన చిత్రాలను మనమే రిలీజ్ చేసుకుందాం. ఒకరి వెనుక వెళ్ళాల్సిన అవసరం లేదు' అని బోస్ వెంకట్ అన్నారు. సీనియర్ దర్శకుడు పేరరసు మాట్లాడుతూ, 'ఇపుడు సినిమా నాశనం చేసేందుకే అనేక మంది ఉన్నారు. దీన్ని గుర్తు పెట్టుకుని చిన్న నిర్మాతలు నడుచుకోవాలి' అని సలహా ఇచ్చారు.

'ఇడ్లీ కడై'పై షాలిని గంపెడాశలు


షాలిని పాండే

బాలీవుడ్ హీరోయిన్ షాలిని పాండేకి అదృష్టం ఏమాత్రం కలిసి రావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు వరుసగా విడుదలవుతున్నప్పటికీ ఆమెకు సరైన బ్రేక్ లభించలేదు. 2017లో వచ్చిన 'అర్జున్ రెడ్డి'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన షాలిని పాండే తమిళ ప్రేక్షకుల్లో తనకంటూ ఓ స్థానాన్ని దక్కించుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన '100 శాతం కాదల్' బాక్సాఫీస్ వద్ద బోల్తాకొట్టింది. అయితే, ఆమె నటనా ప్రతిభను గుర్తించిన దర్శక నటుడు ధనుష్.. తన స్వీయ నిర్మాణంలో రూపొందించిన 'ఇడ్లీకడై'లో మరోమారు అవకాశం ఇచ్చారు. ఇందులో మరో ముఖ్య పాత్ర పోషించిన అరుణ్ విజయ్‌కు జోడీగా షాలిని పాండే నటించారు. దీంతో కోలీవుడ్‌లో మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

మదురై గోట్ ఫైట్ నేపథ్యంలో 'జాకీ'


'జాకీ'లో ఓ దృశ్యం

'మడ్డీ' క్రీడా నేపథ్యంలో విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన డాక్టర్ ప్రభగల్ ఇపుడు మదురై గోట్ ఫైట్ బ్యాక్ డ్రాప్‌లో 'జాకీ' పేరుతో మరో చిత్రాన్ని తెరకెక్కించారు. వచ్చే నెలలో విడుదలకానున్న ఈ చిత్ర విశేషాలను ఆయన తాజాగా మీడియాకు వివరించారు. 'మదురై విహార యాత్రకు వెళ్లినపుడు గోట్ ఫైట్ తొలిసారి చూశాను. దాంతో గోట్ ఫైట్‌పై లోతుగా అధ్యయనం చేశాను. ఇది ఒక క్రీడా పోటీ మాత్రమే కాదు.. తమిళ వారసత్వం, సంప్రదాయంలో అంతర్భాగమని గ్రహించాను. దీంతో 2022లో ఒక డాక్యుమెంటరీ ప్రారంభించాను. సినిమా ప్రామాణికంగా ఉండాలంటే నటీనటులు, పొట్టేళ్లతో మమేకమై నిజమైన బంధాన్ని ఏర్పరచుకోవాలని భావించి, సొంతంగా పొట్టేళ్ళు మేకలను కొనుగోలు చేసి, వాటితో సాంగత్యం ఏర్పరచుకున్నాం. అయితే, ఈ ప్రాజెక్టు కోసం నటీనటుల ఎంపిక సవాల్‌తో కూడుకున్నది. నటులు తమ వ్యక్తిగత సమయాన్ని కేటాయించడంతో పాటు శారీరక శిక్షణ పొందాలి. ప్రాక్టీస్‌లో గాయాలు తగిలే అవకాశం కూడా ఉంది. అందుకే నిబద్ధత ఉన్న యువన్ కృష్ణ, రిధన్ కృష్ణలను ఎంపిక చేశాం. వీరిద్దరూ మదురైలో కొన్ని నెలల పాటు ఉండి శిక్షణ పొందారు. నటి అమ్ము అభిరామి ఒక ముఖ్య పాత్ర పోషించారు. హీరో పాత్రకు సమానంగా విలన్ మధుసూదన్ రావు పాత్ర ఉంటుంది. మూడేళ్ళుగా ఎంతో శ్రమించి ఈ చిత్రాన్ని రూపొందించాం. అని వివరించారు.